# బాబా కథలు



- మహర్షి

సాందీప మహాముని వద్ద బలరామకృష్ణులతో పాటు సుదాముడనే బాలుడు కూడా విద్యనభ్యసించేవాడు. ఒకరోజు వారి ముగ్గురిని సమిధులను తీసుకురమ్మని అడవిలోనికి పంపారు గురువుగారు. వారు ముగ్గురు సమిధులను ప్రోగుచేసి కట్టలను కట్టుకుని ఒకచోట కూర్చున్నారు. కృష్ణుడు బాగా అలసిపోయినట్లు నటిస్తూ ''సుదామా! నాకు బాగా దాహముగా వున్నది'' అన్నాడు. సుదాముడు ''కృష్ణా! పరకడుపున నీరు త్రాగరాదని గురువుగారు చెప్పారు కదా'' అని గుర్తుచేశాడు. ''సరే. నేను నీ తొడమీద తలపెట్టుకుని కొంచెంసేపు విశ్రాంతి తీసుకుంటాను'' అన్నాడు కృష్ణుడు. బలరాముడు కూడా సుదాముని మరొక తొడమీద తలపెట్టుకుని నిద్రపోయాడు. వారిరువురు మంచి నిద్రలో వున్నారనుకుని సుదాముడు తాను తెచ్చుకున్న అటుకులను తినడం ప్రారంభించాడు. సర్వజ్ఞుడయిన కృష్ణుడు కావాలని కళ్ళు తెరవకుండానే ''ఏమి తినుచున్నావు సుదామా!'' అన్నాడు. ''అబ్బే! నా దగ్గర ఏమున్నది? ఏమీలేదు'' అన్నాడు సుదాముడు కంగారుగా. ''తథాస్తు'' అన్నాడు కృష్ణుడు.

కొంతసేపటికి ముగ్గురు ఆశ్రమం చేరుకున్నారు. వారు విద్యలను అభ్యసించిన తరువాత ఎవరి గృహమునకు వారు వెళ్ళిపోయారు.

శ్రీకృష్ణుడు తన అన్న బలరామునితో ద్వారకలో రాజవైభవములతో తులతూగుతున్నాడు. సుదాముడు అనేకమంది బిడ్డలతో పేదరికంతో బాధపడుతున్నాడు.

''ఒకనాడు సుదాముని భార్య—ఏమండీ! శ్రీకృష్ణుడు మీ బాల్యమిత్రుడు కదా! ఒకసారి ఆయన వద్దకు వెళ్ళి మన పరిస్థితి తెలిపి సహాయమర్థించవచ్చుకదా!'' అని భర్తను అడిగింది. సుదాముడు—'ఏమో! సకలసౌభాగ్యములతో తులతూగుతున్న ఆ కృష్ణునికి నేను జ్ఞాపకం ఉంటానోలేదో! నేను వెళ్ళినా గుర్తిస్తాడో లేదో'' అన్నాడు. సుదాముని భార్యకు పట్టుదల నమ్మకం ఎక్కువ. భర్తను బాగా నచ్చచెప్పి ప్రయాణానికి సిద్ధం చేసింది. ''చిన్ననాటి స్నేహితుడు— ఒట్టిచేతులతో ఎలా వెళ్ళేది?'' అన్నాడు సుదాముడు. ఆమె ఇంట్లో ఉన్న వడ్లు దంచి అటుకులు తయారుచేసి ఒక మూటలో కట్టి ఇచ్చింది.

## స్నేహము

సుదాముడు ద్వారకకు చేరుకున్నాడు. అతని రూపము దుస్తులను చూసి ద్వారపాలకులు కృష్ణుని భవనములోనికి వెళ్ళనీయలేదు. ''అయ్యా! నేను శ్రీకృష్ణుని బాల్యమిత్రుడను'' అని ఎంతచెప్పినా వాళ్ళు వినలేదు.

అందులో శ్రీకృష్ణుడు రథమునెక్కి కార్యార్థియై బయలుదేరాడు. జరుగు జరుగు కృష్ణుడు వస్తున్నాడని ద్వారపాలకులు సుదాముని ప్రక్కకునెట్టారు. అసలే ప్రయాణ బడలికచేత ఆహారము, నిద్రలేమి వల్ల నీరసముగా ఉండుట వలన క్రింద పడిపోయాడు. రథం ద్వారము వద్దకు వచ్చింది. కృష్ణుడు క్రిందపడిపోయిన వ్యక్తిని చూశాడు. వెంటనే రథము దిగి తన చిన్ననాటి స్నేహితుని తలను తన తొడమీద పెట్టుకుని ''సుదామా! నేను నీ చిన్న నాటి స్నేహితుడు కృష్ణుడను'' అన్నాడు చెవిలో. మంచినీరు తెప్పించి త్రాగించాడు. సుదాముని లేవనెత్తి భవనంలోనికి తీసుకెళ్ళాడు.

సుదాముని అభ్యంగన స్నానము చేయించి మంచి వస్త్రాలను ధరింపచేయించి పంచభక్ష్యపరమాన్నములతో భోజనం పెట్టాడు కృష్ణుడు. తరువాత కూర్చుని చిన్ననాటి ముచ్చట్లు చెప్పుకున్నారు. ఉన్నట్లుండి కృష్ణుడు ''సుదామా! నా కోసం ఏమి తెచ్చావు?'' అని అడిగాడు. సుదాముడు తాను తెచ్చిన అటుకుల మూటను చూపించుటకు సిగ్గుపడ్డాడు. కానీ, కృష్ణుడు ఆ మూటను లాక్కొని విప్పాడు. ఆ అటుకులను ఆనందముగా తిన్నాడు. మరునాడు సుదాముడు స్నేహితుని వద్ద సెలవు తీసుకుని ఇంటికి బయలుదేరాడు. శ్రీకృష్ణుని ఏమి అడుగలేదు. తన గ్రామము చేరినాడు. తన ఇంటి కొరకు వెదుకుతున్నాడు. తన పెంకుటిల్లు కనిపించుటలేదే అనుకున్నాడు. అంతలో అతని భార్యా ఓ భవనం నుండి బయటకు వచ్చింది. ''ఇదేనండి మన ఇల్లు. మీ స్నేహితుడే మన వైభవమునకు కారణం'' అని భర్తను లోపలకు తీసుకుని వెళ్ళింది. సుదామునికి అప్పుడు అర్థమైనది శ్రీకృష్ణుని ప్రేమ, కరుణ, సర్వమును అడుగుకనే ఇచ్చాడు. సుదాముడు ద్వారకలో తనకు లభించిన ప్రేమాభిమానాలు, జరిగిన సత్కారములను భార్యకు వివరించాడు.

''దేవీ ఏమందు అతని దీనపరత
ప్రేమయే అతడు అతడే ప్రేమ
పేద కుచేలుని అటుకులు పిడికెడు తిని
బహుళ భాగ్యంబు నొసగువారు కలరా!''

అన్నాడు.

ఇక్కడ మనము గుర్తించవలసినది రెండు విషయాలు ఉన్నాయి. భగవంతుడు ఎప్పుడు ఎవరినీ మరవడు. అందులో తనకు సేవచేసిన వారిని తప్పక ఆదుకుంటాడు. అయితే మనము తెలిసో తెలియకనో చేసిన తప్పుకు శిక్ష అనుభవింపవలసిందే. చిన్నప్పుడు సుదాముడు ''నేను ఏమి తినలేదే'' అని అబద్ధమాడాడు. శ్రీకృష్ణుడు తథాస్తు అన్నాడు. అందుకే సుదాముడు పేదరికం అనుభవింపవలసి వచ్చింది. ఇంతేకాదు ఆనాడు సుదాముని తొడమీద తలపెట్టుకు నిద్రపోయాడు కృష్ణుడు. సుదాముడు తన ఇంటికి వచ్చినప్పుడు సుదాముని తలను తన తొడమీద పెట్టుకుని సేదతీర్చి తమ ఋణము తీర్చుకున్నాడు. ఈ సంఘటన వలన మనము తెలుసుకొనవలసినది సుఖదుఃఖములు మనము చేసుకున్న కర్మఫలములే. అంతేకాదు—స్నేహధర్మమంటే ఏమిటో శ్రీకృష్ణుడే నిరూపించుకున్నాడు— అని భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వివరిస్తుంటారు.